సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



పేదలందరికీ రేషన్ కార్డులు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. - 9లో



గొప్ప నేత వాజ్‌పేయి

పేదల సంక్షేమం కోసం పాటుపడిన గొప్ప నేత అటల్ బియారీ వాజ్‌పేయ్ అని బీజేపీ నాయకులు కొనియాడారు. - 9లో



చౌటుప్పల్‌లోని మార్కండేశ్వర స్వామి ఆలయంలో ఉట్టి కొడుతున్న యువకుడు



చిన్ని కృష్ణులు.. చిన్నారి గోపికలు

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం చౌటుప్పల్‌లోని విశాలభారతి స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: పంచ నారసింహుడు కొలువైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం సంప్రదాయ పర్వాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామి వారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ, ఆరాధన చేపట్టారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం వేళ వెండి జోడు సేవలను మాడ వీధుల్లో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం చేస్తున్న బాలికలు

భువనగిరి: భువనగిరి పరిధిలోని రాయగిరి మినీ శిల్పారామంలో శనివారం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రమేష్‌రాజ్ డాన్స్ అకాడమీ కళాకారులు కూచిపూడి నృత్యం చేసి అలరించారు. వరుస సెలవుల నేపథ్యంలో యాదాద్రి క్షేత్రానికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో మినీ శిల్పారామాన్ని సందర్శించారు. సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షించారు. చెరువులో బోటుపై షికారు చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు బాలికలు సింధుప్రియ, భావన రెడ్డి, వందనరెడ్డి, పావని, సింధు, బింధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ మౌనం వీడాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

రామన్నపేట: భారత్‌పై అమెరికా ఆధిపత్యాన్ని నిలువరించడంతో ప్రధామంత్రి మోదీ విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు. సీపీఎం మాజీ జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరి జయంతిని పురస్కరించుకుని శనివారం రామన్నపేటలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై అనేక ఆంక్షలు, వాణిజ్య సుంకాలు విధిస్తున్నా మోదీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దేశ ఆర్థిక వ్యవస్థను అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్న అమెరికా వైఖరిపై భారత్ మౌనం వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ఎం రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, నాయకులు జెల్లెల పెటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, అవ్వారి గోవర్దన్, కూరెళ్ల నర్సింహాచారి, కందుల హన్మంత్, గంటిపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, గన్నెబోయిన విజయభాస్కర్, బావండ్లపల్లి బాలరాజు, గొరిగె సోములు, లెనిన్ శ్రీకృష్ణ, సత్యం, నరేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బాలికలు, వృద్ధులకు ప్రత్యేక సంఘాలు

కొత్త ఎస్‌హెచ్‌జీల ఏర్పాటుకు కసరత్తు

- 15–18 ఏళ్ల వయసున్న బాలికలు, 60 ఏళ్లు నిండిన మహిళలతో ప్రత్యేక గ్రూప్‌లు
- దివ్యాంగులతో సైతం..
- స్వయం సహాయక సంఘాల మాదిరిగా బ్యాంక్ లింకేజీ రుణాలు
- కొనసాగుతున్న అర్హుల గుర్తింపు
- నెలాఖరులోగా సంఘాల ఏర్పాటు, సభ్యులకు బ్యాంక్ ఖాతాలు



మండలాలు	17
మొత్తం సంఘాలు	14,850
సభ్యులు	1,65,258
మండల సమాఖ్యలు	17
జిల్లా సమాఖ్య	01

భువనగిరి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) మరింత విస్తృతం కానున్నాయి. రాష్ట్రంలో కోటి మంది మహిళలను స్వయం సహాయక సంఘాల నెట్‌వర్క్‌లోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి మిషన్-2025ను ప్రకటించింది. ఇందులో భాగంగా 15నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్న బాలికలతో పాటు 60 ఏళ్లు నిండిన మహిళలు, దివ్యాంగులతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయటానికి సెర్ప్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించారు.

పొదుపు, బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన

15–18 ఏళ్ల వయస్సున్న కిశోర బాలికలతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసే డబ్బు పొదుపు చేయడంతో పాటు బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కల్పించనున్నారు. దీంతో పాటు హ్యూమన్ ట్రాఫికింగ్, మహిళలపై వేదింపులు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు, విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం కిశోర బాలికలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. సంఘాల్లో బాలికలను చేర్పించేందుకు సెర్ప్ అధికారులు, సిబ్బంది ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

60 ఏళ్లు దాటిన మహిళలకు మళ్లీ అవకాశం

ప్రస్తుతం ఉన్న స్వయం సహాయక సంఘాల్లో 60 సంవత్సరాలు నిండిన వారిని తొలగిస్తున్నారు. వీరితో మళ్లీ సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. ఏ ఆసరా లేని మహిళలు ఉంటే వృద్ధాప్యంలో చిరు వ్యాపారాలు చేసుకుని బతికేందుకు సాయం చేయడం, నలుగురితో సంఘటితం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం 60 ఏళ్లు దాటిన మహిళలతోనూ సంఘాలు ఏర్పాటు చేస్తోంది.

దివ్యాంగులంతా ఒకే గొడుకు కిందికి..

దివ్యాంగులందరినీ ఒకే గొడుకు కిందికి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల్లో మహిళలతో పాటు పురుషులు కూడా సభ్యులుగా ఉండనున్నారు. మహిళా సంఘాలకు ఇచ్చిన మాదిరిగానే దివ్యాంగులకు కూడా వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వనున్నారు. ప్రతి సంఘంలో 7 నుంచి 10 మంది ఉంటారు.

కార్యాచరణ ఇలా..

నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు ఈ నెల 12నుంచి కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలు, సంఘాల్లో లేని వృద్ధులు, దివ్యాంగులను గుర్తిస్తున్నారు. డీపీఎం, సీసీలు, సిబ్బంది ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. సంఘాల్లో చేరితే కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు సంఘాలు ఏర్పాటు చేసి సభ్యులతో బ్యాంక్ ఖాతాలు తెరిపించనున్నారు. అనంతరం సెర్ప్ వెబ్‌సైట్‌లో నమోదు చేయనున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 14,8450 మహిళా సంఘాలు ఉండగా, వాటిలో 1,65,258 మంది సభ్యులున్నారు.

అర్హులను గుర్తిస్తున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిశోర బాలికలు, దివ్యాంగులు, వృద్ధులను గుర్తిస్తున్నాం. సంఘాల్లో చేరితే కలిగే ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పిస్తున్నాం. ఈనెలాఖరులోగా ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

కాంట్రాక్టుల కోసమే రాజీనామా డ్రామా

- రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ధ్యాస.. అభివృద్ధిపై లేదు
- మునుగోడుకు మంత్రులను, ఎంపీని రానివ్వడం లేదు
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టుల కోసమే రాజీనామా డ్రామా అడుతున్నాడని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. రూ.18వేల కోట్ల కాంట్రాక్టుల కోసం గతంలో రాజీనామా చేసి ఉప ఎన్నిక తెచ్చాడని ఆరోపించారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ధ్యాస మునుగోడు అభివృద్ధిపై లేదన్నారు. శనివారం సంస్థాన్ నారాయణపురం మండలంలోని కంకణాలగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూసుకుంట్ల మాట్లాడారు. 'ప్రభుత్వం సహకరిస్త లేదని అంటున్నావు.. మీ అన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఒక్కసారైనా మునుగోడు నియోజకవర్గానికి తీసుకొచ్చావా' అన్ని ప్రశ్నించారు. మునుగోడుకు నేనే మంత్రి.. నేనే రాజుగా రాజగోపాల్‌రెడ్డి వ్యవహరిస్తున్నాడని, మంత్రులను, ఎంపీని రానివ్వడం లేదన్నారు. 'ఎల్‌బీనగర్ నుంచి పోటీచేస్తే మంత్రి పదవి వచ్చేదని అంటున్నావు.. మునుగోడుపై ప్రేమ ఉంటే మంత్రి పదవి ఎందుకు. మంత్రి పదవి స్టేజీల మీద మాట్లాడితే రాదు.. అధిష్టానంతో మాట్లాడితే వస్తుంది' అని కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వల్ల మునుగోడు నాశనం అవుతుందన్నారు. ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తావో.. ఇంకేం చేస్తావో కానీ అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సూచించారు. సుశీలమ్మ ఫౌండేషన్‌కు నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని, తాను ఎమ్మెల్యేగా అభివృద్ధి పనులు చేపట్టానని అన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాలే కనిపిస్తున్నాయన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన వెంట నారాయణపురం మండల బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్రి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

- ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్ మహరాజ్



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విశారదన్ మహరాజ్, కూసుకుంట్ల, జాజుల శ్రీనివాస్‌గౌడ్

సంస్థాన్ నారాయణపురం: రాజ్యాధికారం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉద్యమించాలని ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ పిలుపునిచ్చారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని కంకణాలగూడెంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆలోచన విధానాలు గొప్పవని, వాటిని యువత ఆచరణలో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుర్వి యాదయ్య, నర్రి నర్సింహ, బైరి శేఖర్, రవీందర్, రమేష్, గాలయ్య, కిరణ్, స్వామి, యాదగిరి, శంకర్, రాజేష్, మధు, భరత్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్‌దే



యాదగిరిగుట్టలో నిర్వహించిన యూత్ ఐకాన్ ర్యాలీలో గొంగిడి మహేందర్‌రెడ్డి, నాయకులు

- ప్రజలంతా కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



ర్యాలీలో గొంగిడి సునీత

యాదగిరిగుట్ట: ఆలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని, కేసీఆర్ దీవెనలతో అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించానని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో బీఆర్‌ఎస్ యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన గొంగిడి యూత్ ఐకాన్ ర్యాలీలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ క్యామ మల్లేష్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గడపగడపకు తీసుకెళ్లాలని యువజన, విద్యార్థి విభాగం, బీఆర్‌ఎస్ కార్యకర్తలను కోరారు. ఆలేరు ప్రజలు తనపై నమ్మకం ఉంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించారని, తుది శ్వాసవరకు వారికి అండగా నిలుస్తానన్నారు. ప్రజలు దీవిస్తే మరోసారి సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా మరో మారు కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని, వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ కార్యదర్శి జనరల్ పాపట్ల నరహరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ర్యాకల రమేష్, నాయకులు బీసు కృష్ణంరాజు, బైరోజు వెంకటచారి, మారెడ్డి కొండల్‌రెడ్డి, వస్పరి శంకరయ్య, పల్లా వెంకట్‌రెడ్డి, తోటకూరి బీరయ్య, జి.బాబురావు, శిఖ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మూసీకి పెరిగిన వరద ఉధృతి



జూలూరు - రుద్రవెల్లి వద్ద లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద



సంగెం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి కాపలా కాస్తున్న కానిస్టేబుల్

- జూలూరు, సంగెం వద్ద వంతెనలపై నుంచి వరద ప్రవాహం
- రాకపోకలు నిలిపివేసిన అధికారులు

భూదాన్‌పోచంపల్లి, వలిగొండ : మూసీకి వరద ఉధృతి పెరిగింది. శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ లోని ఉస్మాన్‌సాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో ఆ నీరంతా మూసీలోకి చేరుతోంది. దాంతో భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు – రుద్రవెల్లి, వలిగొండ మండలం సంగెం వద్ద లో లెవల్ వంతెనల పైనుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు.. ఇరు ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు. భువనగిరి – చౌటుప్పల్ మధ్య సుమారు 15 కిలో మీటర్లు, బీబీనగర్ – పోచంపల్లి మధ్య 30 కిలో మీటర్ల మేరకు చుట్టూ తిరిగి వెళ్తున్నారు. ఈ మార్గాల్లో వారం రోజుల్లో ఐదు రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న వంతెనలను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : చందేపల్లి పరిధిలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ ఏడీ ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అటెండర్, వాచ్‌మన్లు, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 22వ తేదీ లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అదే విధంగా కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో రెండు అకౌంటెంట్, నాలుగు ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏడీ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఏఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసి ఉండాలన్నారు. అకౌంటెంట్ పోస్టుకు బీకాం ఉత్తీర్ణులై కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 22వ తేదీలోపు అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత కార్యాలయాల్లో నేరుగా, లేదా సెల్‌నంబర్ 9441189894ను సంప్రదించాలని కోరారు.

సమస్య తీరే దారేదీ?

భువనగిరిలో రోడ్లు అధ్వానం

- అడుగడుగునా గుంతలు
- వర్షాలకు వాహనదారుల నరకయాతన



గుంతలమయంగా భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ రహదారి

భువనగిరిటౌన్ : ఇటీవలి వర్షాలు జిల్లా కేంద్రంలోని రోడ్లను గుల్ల చేశాయి. అక్కడక్కడ ఉన్న కొద్దిపాటి గుంతలు.. వర్షాల తాకిడికి తారు లేచిపోయి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఎప్పటికప్పుడు మరమ్మతులు, పునరుద్ధరణ (రెన్యూవల్) చేయాల్సిన యంత్రాంగం.. వీటిపై నిర్లక్ష్యం వహిస్తోంది. నిధులు విడుదల చేయించి పనులు చేయించాలన్న ధ్యాస ఎవరిలోనూ లేదు. పట్టణంలో కలెక్టరేట్, జగదేవ్‌పూర్ రోడ్లు, నల్లగొండ మార్గంలో, వినాయక్ చౌరస్తా, ఎస్‌ఎల్‌ఎన్ కళాశాల వద్ద మోకాల లోతులో గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు నీరు నిలవడంతో గుంతలున్నాయన్న విషయం తెలియక పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారినపడ్డారు.



ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కళాశాల వద్ద..



కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో..



వినాయక చౌరస్తా వద్ద ధ్వంసమైన రోడ్డు



మాసుకుంట వద్ద..

ప్రమాదాలు జరుగుతున్నాయి



జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులలో పాటు గల్లీ రోడ్లన్నీ పాడయ్యాయి. మరమ్మతులు చేయిస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాయకులు హామీలు ఇచ్చారు. ఏడాదిన్నర గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదు. వర్షాలు కురిసినప్పుడు గుంతలు నీటితో నిండి వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. రాత్రి సమయంలో రోడ్లపై వెళ్లలేం. ఇప్పటికైనా చొరవ చూపి శాశ్వత మరమ్మతులు చేయాలి.

–ఆమెర్, భువనగిరి

క్లుప్తంగా

మూసీకి భారీగా వరద

- 8 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల



మూసీ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 8,633 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయిలో ఉండటంతో అధికారులు శనివారం ఎనిమిది క్రస్ట్ గేట్లను రెండు అడుగులు పైకెత్తి దిగువకు 10వేల క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వకు 140 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాలవలకు, గేట్ల ద్వారా, ఆవిరి, సీపేజీ, లీకేజీ రూపంలో ప్రాజెక్టు నుంచి మొత్తం 10,200 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా శనివారం సాయంత్రం వరకు 642.50 అడుగులుగా నీటిమట్టం ఉంది.

సినీ దర్శకుడిగా రాణిస్తున్న నిడమనూరు వాసి

- 'ఫ్రెండ్లీ ఘోస్ట్' సినిమాకు దర్శకత్వం వహించిన మధుసూదన్‌రెడ్డి



ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంచు మనోజ్, గోపు మధుసూదన్‌రెడ్డి

నిడమనూరు: నిడమనూరు మండలం గోపువారిగూడెం గ్రామానికి చెందిన గోపు మధుసూదన్‌రెడ్డి సినీ రంగంలో రాణిస్తున్నారు. ఆయన దర్శకత్వం వహించిన ఫ్రెండ్లీ ఘోస్ట్ సినిమా విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ హీరో మంచు మనోజ్ శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. సుచిన్ సినిమా బ్యానర్‌పై మాస్టర్ జియాన్స్ సమర్పణలో సత్యం రాజేష్, సత్యదేవ్ ప్రధాన పాత్రలుగా ఈ సినిమాను తెరకెక్కించినట్లు మధుసూదన్‌రెడ్డి వివరించారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా సాంగ్స్, ట్రైలర్ త్వరలో రాబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



శంకర్ (ఫైల్)

చింతపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. చింతపల్లి ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం కొక్కిరాల గౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని బొత్యతండాకు చెందిన రామావత్ శంకర్(23) డిగ్రీ చదువుతున్నాడు. బైక్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు శుక్రవారం రాత్రి తమ గ్రామానికి సమీపంలోని వెంకటంపేట వద్ద గల పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా.. కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకర్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి తార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అలరించిన గోపిక, శ్రీకృష్ణులు

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని చిన్నారులను గోపికలు, శ్రీకృష్ణుడిగా అలంకరించి ఫొటోలు తీసి పంపించాలనే 'సాక్షి' ఆహ్వానానికి విశేష స్పందన వచ్చింది. తల్లిదండ్రులు తమ చిన్నారులను అందంగా ముస్తాబు చేసి ఫొటోలు తీసి వాట్సాప్‌లో పంపించారు. వాటిలో కొన్ని..



ఇషాన్ అద్వైత్, ఆలేరు; శ్రయాన్ష్, మోత్కూరు; నేహాస్మిత, యాదగిరిగుట్ట; సహర్ష్, రహీంఖాన్‌పేట, ఆత్మకూరు; అన్విక, భూదాన్‌పోచంపల్లి; మన్యు, భువనగిరి; శివ, వెల్లంకి; విహాన్ష్ మోత్కూరు



పల్లెర్ల వివాన్ష్, మోత్కూరు; చింతల కుశాంక్‌రెడ్డి, అంబబావిగూడెం, రామన్నపేట



కాలేరు రుదాన్ష్, పర్ణిక, కిర్షిక, భువనగిరి; ధ్రువతేజ, పనకబండ, మోత్కూరు; చిత్తలూరి మోక్షిత, డి. రేపాక; కొండ మితాన్ష్, నారాయణపురం; చిన్మయి, భవ్యాన్ష్, అంకమామిడి; మెరుగు యశవిక, రహీంఖాన్‌పేట



వనం అశ్వథ్, వెల్లంకి; వనం దీక్షిత్, వెల్లంకి; జాన్విక, జాన్వి, భువనగిరి; ఎడ్ల సూర్యాన్ష్, మోత్కూరు; శ్రీదక్షిత్, ఎం.తుర్కపల్లి; క్రితిక్ నిహాన్, భువనగిరి; ఇషాన్, పాలడుగు, మోత్కూరు; జోయానిష్, తుర్కపల్లి; బిక్కి. శ్రీనిష్‌గౌడ్, గోకారం; రిత్విక్, యెల్లగిరి, చౌటుప్పల్



విష్ణు, పనకబండ; లిషాంత్, పాలడుగు; కిర్షిక, పాలడుగు; సహసాద్ర్, వెల్లంకి; శ్రీయాన్ష్, చిన్నకొండూరు; హితిక, రాయిపల్లి, ఆత్మకూరు; అద్వైత, ఆద్యంత్, బీబీనగర్; నైనా, సిరిపురం, రామన్నపేట; సాగర్ల రిత్విక్ యాదవ్, ప్రజ్ఞ, వెల్లంకి; యాపిల్‌గాడ్, సంస్థాన్‌నారాయణపురం; కన్నయ్య, భువనగిరి



అక్షర, భూదాన్‌పోచంపల్లి; శ్రీవర్షిణి, వంగపల్లి; క్రిత్విక్, పనకబండ, మోత్కూరు; కృతిక, పరాశర, భువనగిరి; దేవాన్ష్, ఆత్మకూరు

వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని..

- ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట మృతురాలి కుటుంబ సభ్యుల ఆందోళన

తుంగతుర్తి: తన భార్య మృతికి ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడే కారణమని ఆరోపిస్తూ మృతురాలి భర్త, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం గోరంట్ల గ్రామానికి చెందిన భయగ్ల విజేత(26) కడుపునొప్పితో బాధపడుతూ శుక్రవారం తుంగతుర్తిలోని సాయిబాలాజీ ఆస్పత్రికి వచ్చింది. ఆమెకు ఆస్పత్రి డాక్టర్ శ్రీనివాస్ వైద్యం చేశాడు. అయినప్పటికీ ఆమెకు కడుపునొప్పి తగ్గకపోవడంతో స్వయంగా ఆ డాక్టరే ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె శనివారం మృతిచెందింది. విజేత మృతికి తుంగతుర్తిలోని సాయిబాలాజీ ఆస్పత్రి వైద్యుడే కారణమని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆమె మృతదేహం ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని తగిన న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. మృతురాలి భర్త భయగ్ల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రుద్ర క్రాంతికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని పవర్‌లూమ్ కార్మికుడి ఆత్మహత్య



రామకృష్ణ (ఫైల్)

రాజాపేట: ఇంట్లో ఉరేసుకుని పవర్‌లూమ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజాపేట మండల కేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది. రాజాపేట మండల కేంద్రానికి చెందిన పెంట రామకృష్ణ (42)కు భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పవర్‌లూమ్‌పై జీవనోపాధి పొందుతున్నాడు. ఏడాది క్రితం ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబంలో గొడవలు జరిగాయి. దీంతో లావణ్య పిల్లలను తీసుకుని తన తల్లిగారి ఊరైన రేణికుంట గ్రామానికి వెళ్లిపోయింది. రామకృష్ణ హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. గురువారం రామకృష్ణ గ్రామానికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం సాయంత్రం రామకృష్ణ ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు తీసి చూడగా రామకృష్ణ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ఆత్మకూరు(ఎం): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండలం మొరిపిరాల గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నగూడెంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగూడెం గ్రామానికి చెందిన పంజాల మల్లేశంగౌడ్(32)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. అతడు భార్య, కుమార్తెతో కలిసి హైదరాబాద్‌లోని రావిర్యాలలో ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఐదు రోజుల క్రితం భార్యతో గొడవపడి మల్లేశంగౌడ్ స్వగ్రామం చిన్నగూడెంకు వచ్చాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన మల్లేశంగౌడ్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ హనుమంతు తెలిపారు.

యాదగిరీశుడి సేవలో ఢిల్లీ హైకోర్టు జడ్జి



జస్టిస్ రాజ్‌నీష్‌కుమార్ గుప్తకు ఆశీర్వచనం చేస్తున్న ఆలయ అర్చకుడు

యాదగిరిగుట్ట: ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ రాజ్‌నీష్‌కుమార్ గుప్త తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో ఇద్దరు దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

- నిందితుల నుంచి 554గ్రా. బంగారం, రూ.92,500 నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట పట్టణంలోని శ్రీసాయి సంతోషి జ్యూయలరీ షాపులో జూలై 21న రాత్రి జరిగిన భారీ దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. నిందితుల నుంచి రూ.60లక్షల విలువ గల 554 గ్రాముల బంగారం, రూ.92,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. సాంకేతిక ఆధారాలతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం దక్షిణ్ దినాజ్‌పూర్ జిల్లా, బైహోర్ గ్రామానికి చెందిన ఏ–4 అయిన మాలిక్ మొల్లా అనే దొంగను ఈ నెల 11న సూర్యాపేట పోలీసులు అరెస్టు చేశారు. అలాగే నేపాల్‌కు చెందిన ఏ–6 నిందితుడు అమర్ భట్‌ను ఖమ్మం పట్టణంలో అదుపులోకి తీసుకుని అతని వద్ద రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏ–6 నిందితుడైన అమర్‌భట్ ఖమ్మంలో దొంగలకు ఆశ్రయం ఇవ్వడం, రెక్కీ చేసేందుకు సహాయం చేసినట్టు చెప్పారు. ఏ–4 నిందితుడైన మాలిక్ మొల్లాను పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తపన్ పోలీస్ స్టేషన్ పోలీసుల సహాయంతో అరెస్టు చేసి అతని వద్ద నుంచి సుమారు రూ.60 లక్షల విలువ గల 554 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.87,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని బలార్ ఘాట్‌లోని జిల్లా కోర్టులో న్యాయమూర్తి వద్ద నిందితుడిని ప్రవేశపెట్టి ఏడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతి తీసుకుని నిందితుల రాష్ట్రాల బదిలీ (ట్రాన్సిట్) నిబంధనల ప్రకారం సూర్యాపేటకు తీసుకొచ్చారు.

జూలై 27న మహిళ అరెస్టు, 14తులాలు స్వాధీనం

ఇదే కేసుతో సంబంధమున్న మహిళను జూలై 27న అరెస్టు చేసి ఆమె వద్ద 14 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ఆ మహిళను విచారించగా పలు విషయాలు వెల్లడించినట్టు చెప్పారు. అదేవిధంగా పట్టుబడిన మాలిక్ మొల్లాను విచారించగా నేపాల్‌కు చెందిన ఏ–1 ప్రకాశ్ అనిల్‌కుమార్, ఏ–2 కడక్‌సింగ్ అహుల్‌వాలియ, ఏ–3 పురన్‌ప్రసాద్ జోషి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మల్దా జిల్లాకు చెందిన ఏ–5 జషిముద్దీన్‌తో కలిసి శ్రీసాయిసంతోషి జ్యూయలరీ షాపులో దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారని వెల్లడించారు.

అద్దెకు తీసుకున్న రూంలో బంగారం పంచుకొని పరార్..

దొంగతనానికి పాల్పడిన దొంగలు షాపు సమీపంలో తీసుకున్న అద్దె రూంలో 5 భాగాలుగా పంచుకుని దొంగతనానికి సహకరించిన ఏ–7 అయిన యశోద అనే మహిళకు, ఏ–6 అయిన అమర్ భట్‌లకు ఖర్చుల కోసం కొంత బంగారం, డబ్బులు ఇచ్చి అక్కడి నుంచి పరారయ్యారు. నేపాల్‌కు చెందిన ఏ–1 ప్రకాష్ అనిల్ కుమార్, ఏ–6 అమర్‌భట్‌లు ఇద్దరు ఖమ్మంలో గూర్ఖాగా పనిచేస్తూ వచ్చే సంపాదన సరిపోక దొంగతనాలు చేయాలని నిర్ణయించుకుని ఖమ్మంలో దొంగతనాలు చేసి కేసుల్లో జైలుకు సైతం వెళ్లి వచ్చారు.

మిగతా నిందితుల కోసం గాలింపు..

ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులు కాగా అందులో ముగ్గురిని అరెస్టు చేయగా మిగతా ఏ–1 ప్రకాష్ అనిల్‌కుమార్, ఏ–2 కడాక్ సింగ్, ఏ–3 పురన్‌ప్రజోషి, ఏ–5 జషిముద్దీన్ నిందితుల కోసం పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో బాగా పనిచేసిన పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌ఐలు, సిబ్బందిని ఎస్పీ నరసింహ అభినందించి రివార్డ్ అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్‌కు పర్యాటకుల తాకిడి



సాగర్ అందాలను ఫోన్‌లో బంధిస్తున్న పర్యాటకులు



సాగర్ సందర్శనకు వచ్చి కేరింతలు కొడుతున్న చిన్నారులు

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. కృష్ణాష్టమి సందర్భంగా శనివారం సెలవు కావడంతో సాగర్ అందాలను తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్పిల్ వే మీదుగా కిందకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ పరవళ్లను ఫొటోలు తీసుకుంటూ, సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు. పర్యాటకుల వాహనాలతో లాంచీ స్టేషన్ వద్ద, పైలాన్ కాలనీ మూడు రోడ్ల కూడలిలో, కొత్త వంతెన సమీపంలో ట్రాఫిక్ జాం అయ్యింది. ఆంధ్రప్రదేశ్ నుంచి 50 మంది, తెలంగాణ నుంచి 50 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు తీసుకున్నారు.

నాగార్జునకొండలో పర్యాటకులను వదిలివచ్చిన లాంచీ స్టేషన్ సిబ్బంది

నాగార్జునకొండ సందర్శనకు శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు లాంచీలో వెళ్లిన పర్యాటకులను నాగార్జునకొండలోనే వదిలి.. లాంచీ ఎక్కిన వారిని తీసుకుని లాంచీ స్టేషన్‌కు తిరిగి వచ్చింది. దీంతో 30 మంది పర్యాటకులు నాగార్జునకొండ పైనే ఉండిపోయారు. అక్కడున్న పర్యాటకులు ఫోన్లు చేయడంతో తిరిగి లాంచీ వెళ్లి రాత్రి వేళ వారిని తీసుకుని వచ్చింది. లాంచీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కనీసం పర్యాటకులు అందరూ వచ్చారా లేదా అని చూసుకోకుండానే తిరిగి వస్తున్నారని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



లాంచీ స్టేషన్ వద్ద కిటకిటలాడుతున్న పర్యాటకులు